క్లుప్తంగా

వనదుర్గ ఆలయంలో చండీహోమం



వనదుర్గ ఆలయం వద్ద చండీ హోమంలో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేద పండితులు

అన్నవరం: రత్నగిరి వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీహోమం ఘనంగా నిర్వహించారు. ప్రధానాలయంలోని సత్యదేవుని దేవేరి అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, కొండ దిగువన తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గమ్మకు పండితులు కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉదయం 9 గంటలకు పండితులు వనదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం చండీ హోమం ప్రారంభించారు. వేద పండితులు, వనదుర్గ ఆలయ అర్చకులు, వ్రతపురోహితులు, భక్తులు పాల్గొన్నారు.

తెగుళ్లు నివారిస్తే నాణ్యమైన పట్టుగూళ్ల ఉత్పత్తి



మల్బరీ తోటలను రైతులతో కలసి పరిశీలిస్తున్న శాస్త్రవేత్త భువనేశ్వరి

తుని రూరల్: సకాలంలో గుర్తించి తెగుళ్లు నివారిస్తే నాణ్యతగల పట్టుగూళ్ల ఉత్పత్తి సాధ్యమవుతుందని శాస్త్రవేత్త ఈ.భువనేశ్వరి అన్నారు. శుక్రవారం తుని మండలం దొండవాకలో మల్బరీ తోటల యాజమాన్యం, పట్టుపురుగులు, పెంపకం, నాణ్యతగల పట్టుగూళ్ల ఉత్పత్తిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సెరికల్చర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రైతులతో కలసి క్షేత్ర స్థాయిలో మల్బరీ తోటలను, పట్టు పురుగులను పరిశీలించి పలు సూచనలు చేశారు. నాణ్యమైన పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని, ఫలితంగా లాభాలు ఆర్జించవచ్చన్నారు. చేబ్రోలు టీఎస్సీ అసిస్టెంట్ సెరికల్చర్ ఆఫీసర్ సత్యనారాయణ, టీఏలు, రైతులు పాల్గొన్నారు.

నేడు ఉల్లాస్ శిక్షణ తరగతులు

ప్రత్తిపాడు: అక్షరాంధ్ర (ఉల్లాస్) వలంటీరు టీచర్లకు ప్రత్తిపాడు లయన్స్ క్లబ్ కల్యాణ మండపంలో ఈనెల 30న శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు తెలిపారు. మండలంలోని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, వెలుగు పథకాల్లో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, యానిమేటర్లకు ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ పొందిన ట్రైనర్లు గ్రామాల్లో ఒక్కొక్కరు పది మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేంతుకు వివిధ మార్గాల ద్వారా కృషి చేయాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు కోరారు.


తాగునీరు వృథా



కాకరాపల్లిలో వృథాగా పోతున్న తాగునీరు

కోటనందూరు: కాకరాపల్లి దుర్గమ్మగుడి ప్రాంతంలో తాగునీరు వృథాగా పోతోంది. పంట పొలాల్లో ఉన్న బోరు నుంచి ట్యాంకుకు నీరు పంపించేందుకు పైపులైను ఉంది. ఈ పైపులైను దుర్గమ్మగుడి ప్రాంతంలో తుని-నర్సీపట్నం రోడ్డు కిందిభాగంలో శిథిలమై తాగునీరు వృథాగా పోవడంతో పాటు తుని-నర్సీపట్నం రోడ్డుకు పెద్ద గుంత ఏర్పడింది. ఈ గుంత వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది. ఇక్కడ రాత్రి వేళల్లో ప్రయాణం ప్రమాదభరితంగా మారిందిని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సమస్య మరింత జటిలమైందని చెబుతున్నారు. సమస్య కళ్లముందు కనిపిస్తున్నా సచివాలయ ఉద్యోగులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పైపులైనుకు మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

ఆశా వర్కర్ల కార్యవర్గం ఎన్నిక



తుని మండల ఆశా వర్కర్ల సమావేశం

తుని: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన కమిటీకి ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రమల్ల పద్మ సూచించారు. శుక్రవారం తుని పట్టణం కొండవారిపేటలో ఆశా వర్కర్ల తుని మండలి కమిటీ కార్యవర్గ ఎన్నిక పద్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్.శ్రీనివాస్, అధ్యక్షురాలుగా పుష్పలత, కార్యదర్శి భవానీ, కోశాధికారి రాజేశ్వరి, ఆఫీసు బేరర్లుగా సంతోషి, అజ్జమ్మ, సీతారత్నం, వరలక్ష్మి, సత్యవతి,అప్పయమ్మ ఎన్నికయ్యారు. తుని మండల మూడు పీహెచ్‌సీలకు చెందిన ఆశా వర్కర్లు, సీఐటీయూ నాయకుడు జి.వెంకటరమణ పాల్గొన్నారు.

కొత్త పింఛన్లు ఎప్పుడో..?

- నేటికీ అందుబాటులోకి రాని ప్రభుత్వ వెబ్‌సైట్
- అధికారుల చుట్టూ తిరుగుతున్న అర్హులు
- కూటమి సర్కార్ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



ప్రత్తిపాడులో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేస్తున్న వలంటీరు (ఫైల్)

ప్రత్తిపాడు: టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుకు నోచుకోవడం లేదు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇంత వరకు కొత్త పింఛన్లకు దరఖాస్తుల స్వీకరణకు నోచుకోలేదు. ఇంతలోనే ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేసుకోవడం, దిగ్విజయంగా ఏడాది పాలన పూర్తయ్యిందంటూ సంబరాలు జరుపుకున్న తీరుపై అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి, ఏలేశ్వరం నగర పంచాయతీలోని 83 సచివాలయాల పరిధిలో వివిధ రకాల పింఛన్లు 37,414 ఉన్నాయి. కొత్తగా అర్హత కలిగిన వితంతు, దివ్యాంగులు, వృద్ధులు, చర్మకారులు, గీత కార్మికులు, డప్పు కళాకారులు కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్నారు. ఎస్సీ, బీసీలకు చెందిన వారికి 50 ఏళ్లకే పింఛన్ అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఎటువంటి ప్రకటనా చేయలేదు. దీంతో అర్హులైన పేదలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజూ వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాలకు వస్తూనే ఉన్నారు. ప్రభుత్వం నూతన పింఛన్ల కోసం ఎలాంటి వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులైన వారు నిరాశతో తిరిగి వెళుతున్నారు. కొత్తగా వివాహాలైన వారు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకుందామని సచివాలయాలకు వెళ్లినా నిరాశ తప్పడం లేదు.

ఏడాది పూర్తయినా తెరుచుకోని వెబ్‌సైట్

ఎన్నికల నోటిఫికేషన్ సందర్భంగా నిలిచిపోయిన వెబ్‌సైట్, కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఎందుకు తెరుచుకోలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రశ్నలకు సరైన సమాధానం లేకపోవడంతో సచివాలయ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా వృద్ధులు కార్యాలయం బయట కనిపిస్తే ఉద్యోగులు తప్పని పరిస్థితిలో వారికి ఏదో ఒక సమాధానం చెప్పి పంపిస్తున్నారు. పింఛన్ కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతవులు తదితరులతో పాటు కొత్తగా వివాహమైన వారు కొత్త రేషన్ కార్డుల కోసం ఎప్పుడు వెబ్‌సైట్ ప్రారంభిస్తారోనని ఎదురు చూస్తున్నారు.

గత ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం గ్రామ వలంటీర్లు అర్హులైన వారి ఇళ్లకు వెళ్లి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. రాజకీయ నాయకుల సిఫార్సులు, అధికారుల ఒత్తిడి లేకుండానే దరఖాస్తు చేసుకున్న ఆరు నెలలకు ఒకసారి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగేది. నేడు ఆ పరిస్థితి లేదు. అర్హులైన వారు నిత్యం సచివాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పింఛన్ మంజూరు చేయాలంటూ అధికారులకు ఎక్కువ శాతం పేదలు అర్జీలు సమర్పిస్తున్నారు.

పింఛన్లను తొలగించేందుకు కుయుక్తులు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలపై జన్మభూమి కమిటీలదే పెత్తనం. సంక్షేమ పథకాలు వర్తించాలంటే జన్మభూమి కమిటీ సభ్యులను ప్రసన్నం చేసుకోవాల్సిందే. మళ్లీ జన్మభూమి కమిటీలొచ్చినా, రాకపోయినా కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు ప్రస్తుతం వస్తున్న పింఛన్లను తొలగించేందుకు కొందరు అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతారనే విమర్శలు వస్తున్నాయి.

నియోజకవర్గంలో పింఛన్ల వివరాలు

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	మొత్తం పింఛన్లు
ప్రత్తిపాడు	23	26	11,539
శంఖవరం	14	16	7,555
రౌతులపూడి	26	17	7,962
ఏలేశ్వరం	12	15	6,661
ఏలేశ్వరం నగర పంచాయతీ	1	9	3,697
మొత్తం	76	83	37,414

మన మిత్ర యాప్‌లో దరఖాస్తులు



"కేవలం కొత్త పింఛన్ గ్రీవెన్స్ కోసం మన మిత్ర యాప్‌లో ప్రత్యేక సదుపాయం ప్రారంభించినట్టు పేదరిక నిర్మూలన సొసైటీ (సెర్ప్) అధికారులు అధికారికంగా ప్రకటించారు. కొత్త పింఛన్ దరఖాస్తుదారులకు అర్హత పత్రాల లోపాలు, పేరు సవరణలు, రికార్డు లోపాలు వంటి సమస్యలు ఎదురైనపుడు మొబైల్‌లోనే మన మిత్ర యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు."

– ఎంవీఆర్ కుమార్ బాబు, ఎంపీడీఓ, ప్రత్తిపాడు

బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడు

ప్రత్తిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను కొనియాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించి 78 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక అంబేడ్కర్ కళామందిర్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ధరణాలకోట శ్రీను మాట్లాడుతూ 1947 ఆగస్టు 29న అంబేడ్కర్‌ను డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులై కమిటీ సభ్యులతో ప్రశంసలందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ కమిటీ నాయకులు దాసరి సత్తిబాబు, సోర్నపూడి కోటేశ్వరరావు, కందిమళ్ల సామ్యేలు, మూరా రాంబాబు, మేడపాటి కృష్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా సాయి ప్రదీప్

ప్రత్తిపాడు: గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్ (జీఎస్ఏ)గా ఎంపికైన స్పార్క్ ఫౌండేషన్ సీఈఓ ఎస్ సాయి సందీప్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. పెదశంకర్లపూడిలో శుక్రవారం నిర్వహించిన ఓకార్యక్రమంలో సాయి ప్రదీప్‌ను సత్కరించి, గూగుల్ అంబాసిడర్ కిట్‌ను ఆమె అందజేశారు. ఏలేశ్వరం మండలం యర్రవరానికి చెందిన సాయి ప్రదీప్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి గూగుల్ స్టూడెంట్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు ఎస్ విజయబాబు, మాజీ జెడ్పీటీసీ జ్యోతుల పెదబాబు, స్పార్క్ చైర్మన్ సాయి సందీప్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అనుసూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టును పునర్నిర్మించాలి

తుని రూరల్: హంసవరం ఎస్సీ పేటలో ప్రభుత్వ పాఠశాలను అనుకుని ఉన్న కల్వర్టును పునర్నిర్మించాలని ఆ ప్రాంత దళితులు డిమాండ్ చేశారు. గ్రామకంఠం భూమిని ఆక్రమించుకునేందుకు ఈనెల 3న కూటమి పార్టీలకు చెందిన నాయకులు అనుమతి లేకుండా పది అడుగులు కాలువ తవ్వడంతో పాటు రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టును ధ్వంసం చేశారని సర్పంచ్ రాయి మేరీ అవినాష్, మాజీ ఎంపీటీసీ మాస రామదాసు, అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు మాస పంపరాజు, సచివాలయ కన్వీనర్ పెదపాటి బాలమురళి, దళిత నాయకులు ఆరోపించారు. కాలువ తవ్వకాన్ని, కల్వర్టు ధ్వంసం చేయడాన్ని దళితులంత ఐక్యంగా అడ్డుకోవడంతో ఆక్రమణకు గురికాలేదన్నారు. మరుసటి రోజు రెవెన్యూ, పోలీసు, పంచాయతీరాజ్ అధికారుల సమక్షంలో వివాదాన్ని పరిష్కరించేందుకు సమావేశం జరిగిందని, ధ్వంసం చేసిన కల్వర్టును పునర్నిర్మించేందుకు అంగీకరించినా ఇప్పటి వరకు పనులు చేపట్టలేదని వారు పేర్కొన్నారు. పాఠశాల సమీపంలోనే ఉండడంతో పిల్లలు ఆడుకుంటూ తవ్వేసి వదిలేసిన పది అడుగుల కాలువలో పడిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు కాలువలో పడి గాయపడ్డారన్నారు. అధికారులు స్పందించి కాలువ పూడ్చివేయడంతో పాటు కల్వర్టు పునర్నిర్మించి సమస్య పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. దీనిపై ఎంపీడీఓ కె.సాయినవీన్‌ను వివరణ కోరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

నకిలీ గార్డుపై బైండోవర్ నమోదు

తుని: రైల్వే గార్డునంటూ టికెట్ కలెక్ట్ సిబ్బందిపై దురుసుగా వ్యవహరించిన బలిమిడి భాస్కర్‌పై బైండోవర్ నమోదు చేశారని తుని రైల్వే జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఉదయం కడప వెళ్లడానికి కడపకు చెందిన బలిమిడి భాస్కర్ తుని రైల్వేస్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్ ఎక్కడానికి వచ్చాడు. అప్పటికే రైలు వెళ్లిపోగా తెలుపు డ్రస్ ధరించిన భాస్కర్ అనుమానంగా తిరుగుతున్నాడు. ఇది గమనించిన కమర్షియల్ విభాగం సిబ్బంది ప్రశ్నించారు. తాను విజయవాడలో గార్డుగా పని చేస్తున్నానని చెప్పాడు. ఆధార్, ఐడీ కార్డులను చూపించాలని అడిగారు. భాస్కర్ వారికి దురుసుగా సమాధానం చెప్పాడు. జీఆర్పీ స్టేషన్‌కు తీసుకువచ్చి భాస్కర్‌ను ప్రశ్నించారు. సరైన సమాధానం చెప్పకపోవడంతో స్టేషన్ డ్యూటీ మాస్టర్ ఫిర్యాదు మేరకు బీఎన్ఎస్ఎస్ 120 సెక్షన్ కింద అదుపులోకి తీసుకుని మండల ఎగ్జిక్యూటివ్ ఎదుట హాజరు పరచగా బైండోవర్ నమోదు చేశారని ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

యూరియా కోసం పాట్లు



ప్రత్తిపాడులో యూరియా కోసం రైతుల నిరీక్షణ

ప్రత్తిపాడు: యూరియా కొరత కారణంగా రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రత్తిపాడు తహసీల్దార్ కార్యాలయం పాత భవనం వద్ద యూరియా కోసం రైతులు ఎదురుచూస్తూ పడిగాపులు కాస్తున్నారు. ప్రత్తిపాడు గ్రామానికి రెండో విడతగా పది మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఏనాడూ ఎరువుల కోసం ఎదురుచూడలేదని రైతులు చెబుతున్నారు. రైతుకు ఒక బస్తా, ఐదెకరాల పైబడి ఉన్న రైతుకు రెండు బస్తాల వంతున పంపిణీ చేస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి జోకా అమృత శుక్రవారం తెలిపారు.

అందుబాటులోని లేని సచివాలయ సిబ్బంది



మల్లేపల్లి సచివాలయం-1 పరిధిలో మూసి ఉన్న రైతు సేవా కేంద్రం

గండేపల్లి: సచివాలయ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రంగంపేట మండలం చంద్రేడుకు చెందిన గుమ్మళ్ల మంగతాయారుకు మండలంలోని మల్లేపల్లిలో ఎకరం పొలం ఉంది. వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం సొమ్ము జమ కాకపోడంతో ఆమె చెల్లి కుమారుడు వెంకట్‌ను తీసుకుని శుక్రవారం సచివాలయం-1 పరిధిలోని రైతు సేవా కేంద్రానికి వచ్చారు. రైతు సేవా కేంద్రం వద్ద సంబంధిత సిబ్బంది లేకపోగా కార్యాలయ షట్టర్ కొంతమేర మూసి కుర్చీ అడ్డుగా పెట్టారు. సమస్య పరిష్కారానికి వచ్చిన లబ్ధిదారులు సుమారు గంట పాటు అక్కడే వేచి ఉన్నారు. అయినప్పటికీ సిబ్బంది రాకపోవడంతో గ్రామంలోని తురాయి చెట్టు వద్ద సచివాలయం-1 వద్ద ఉన్న సిబ్బందిని సమాచారం కోరగా అందుబాటులో లేని ఉద్యోగులను వెనకేసుకువచ్చే విధానంలో సమాచారం తెలిపారని మంగతాయారు ఆవేదన వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది తీరుపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు



అన్నవరంలో క్యూఆర్ కోడ్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ముద్రగడ గిరిబాబు, నాయకులు

అన్నవరం: గత అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి హామీలను నమ్మి ప్రజలు కూటమికి ఓట్లు వేశారని, అధికారంలోకి వచ్చిన తరువాత ఆయన ఆ హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ముద్రగడ గిరిబాబు విమర్శించారు. 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం శుక్రవారం అన్నవరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ముద్రగడ గిరిబాబు ప్రసంగిస్తూ ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజమని విమర్శించారు. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు.

కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటా

వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు త్వరలో ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు చేసిన మోసాలను వివరిస్తామన్నారు. నియోజకవర్గంలో తన తండ్రి ముద్రగడ పద్మనాభం చేసిన అభివృద్ధి పనులు, ఎవరి వద్ద రూపాయి లంచం తీసుకోకుండా నిజాయతీగా చేసిన పనులు ప్రజలకు తెలుసునన్నారు. తాను కూడా అదే బాటలో పయనించి కార్యకర్తలకు, ప్రజలకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు. సమావేశానికి శంఖవరం మండల పార్టీ కన్వీనర్ నరాల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. సర్పంచ్‌లు శెట్టిబత్తుల కుమార్‌రాజా, సకురు గుర్రాజు, ఎంపీటీసీ దడాల సతీష్, పబ్లిసిటీ సెల్ అధ్యక్షుడు సరమర్ల మధుబాబు, పార్టీ నాయకులు ఈగల అప్పారావు, బొట్టా చైతన్య, గౌతు స్వామి, పలివెల నాగేంద్ర, అడపా సోమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ బ్యానర్ ఆవిష్కరించారు.

రైతులకు ఘన సత్కారం



ప్రత్తిపాడులో ఉత్తమ రైతులను సత్కరిస్తున్న బీకేఎస్ జిల్లా కమిటీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్తిపాడు మునసబు గారి రామాలయం వద్ద బలరామ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత కిసాన్ సంఘ్ పతాకాన్ని బీకేఎస్ రాష్ట్ర నాయకుడు యల్లపు సూర్యనారాయణ ఆవిష్కరించారు. రైతు ఆయుధం నాగలికి, బలరాముడు చిత్రపటానికి పూజలు చేశారు. ఉత్తమ సంఘ సేవకుడు, విశ్రాంత విద్యాశాఖాధికారి ముక్కు సుబ్రహ్మణ్యం, విశిష్ట రైతులు ఉత్తమ విశ్రాంత సైనికుడు కర్రి ధర్మరాజు, ఉత్తమ మహిళా రైతు ఏలూరు మాజీ సర్పంచ్ రొంగల యమున, ఉత్తమ వృద్ధ రైతు బుద్ధా శివన్నారాయణ, ఉత్తమ గోసేవకుడు మాదేపల్లి నాగేశ్వరరావు, ఉత్తమ ప్రకృతి వ్యవసాయ రైతు బాదం రాజులను బీకేఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. అనంతరం జిల్లా బీకేఎస్ అధ్యక్షుడు రాసంశెట్టి రాజా అధ్యక్షతన బీకేఎస్ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. బీకేఎస్ జిల్లా ప్రతినిధులు కంపరపు నాగేశ్వరరావు, దాడిశెట్టి జానకీ పావని లక్ష్మీ, ఆకుల హరిబాబు, శింగిలిదేవి సత్తిరాజు, కిర్లంపూడి మండల బీకేఎస్ అధ్యక్షుడు రాపేటి శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

కమిషనర్ తీరుపై కౌన్సిలర్ల ఆగ్రహం

గరంగరంగా కౌన్సిల్ అత్యవసర సమావేశం



మున్సిపల్ చైర్‌పర్సన్ భువన సుందరి

తుని: మున్సిపాలిటీలో కౌన్సిలర్లకు కనీస మర్యాద లేదని, ఏ పని చెప్పినా ఒక్క అధికారీ పనిచేయడం లేదని ఇలాంటి పరిస్థితుల్లో పదవిలో కొనసాగడం ఎందుకంటూ కమిషనర్ తీరుపై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్రావు సక్రమంగా పని చేయడం లేదని మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని వారు హెచ్చరించారు. శుక్రవారం ఉదయం తుని మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ నార్ల భువన సుందరి అధ్యక్షతన నిర్వహించారు. అజెండాలో పొందిపరిచిన 10 అంశాలను సభ్యులు ఆమోదించారు. అనంతరం మున్సిపాలిటీలో వైఫల్యాలు, కమిషనర్ పని తీరును కౌన్సిలర్లు ఎండగట్టారు.

సమస్యలపై చర్చ

తుని మున్సిపాలిటీలో కౌన్సిలర్లు ఉత్సవ విగ్రహాలుగా మారారని వైస్ చైర్మన్ ఆచంట సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లినా పరిష్కారం కావడం లేదని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. మున్సిపాలిటీ ఇద్దరు ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వచ్చినా ఇంత వరకు వారిపై చర్యలు తసుకోలేదని ధ్వజమెత్తారు. దీనిపై కమిషనర్ వెంకట్రావు స్పందిస్తూ విధుల్లో అవకతవకులకు పాల్పడిన సునీత అనే ఉద్యోగిపై చర్యలు తీసుకున్నామని, ఆమె ఆస్తి సీజ్ చేసేందుకు ఉన్నతాధికారుల అనుమతి కోరామన్నారు. మరో ఉద్యోగి సుల్తాన్‌పై చర్యలు తీసుకోవాలని తుని పట్టణ సీఐకు లేఖ రాశామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ భువన సుందరి కలుగు జేసుకుని సీఐకు లేఖ రాసిన విషయాన్ని తనకు ఎందుకు తెలియజేయలేదని కమిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించడం అధికారులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. పట్టణంలో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారని, పారిశుధ్యం అధ్వానంగా ఉందని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ షేక్ ఖ్వాజా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఆయా వార్డులకు చెందిన కౌన్సిలర్లు గళం వినిపించారు. కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలను పరిష్కరించాలని అధికారులను సీపీ భువనసుందరి ఆదేశించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయం



శిక్షణ తరగతులలో వలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ హరికృష్ణ

కిర్లంపూడి: సంపూర్ణ అక్షరాస్యతే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ తెలిపారు. ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సమావేశపు హాలులో ఎంపీడీఓ అధ్యక్షతన వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ మండలంలోని 2,500 మంది నిరక్షరాస్యులు ఉన్నారని తెలిపారు. వారికి విద్యను అందించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వెలుగు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయాల నుంచి ఎంపిక చేసిన సుమారు 250 మంది వలంటీర్లకు రెండు రోజుల పాటు శిక్షణనిస్తామని తెలిపారు. ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ, కమ్యూనిటీ సెంటర్లలో సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిరక్షరాస్యులకు శిక్షణనిస్తామన్నారు. అనంతరం నిరక్షరాస్యులు లేని సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్, ఏపీఎం నాయుడు, ఏపీఎం. వేదకుమారి ఉన్నారు.

గిడుగుకు ఘన నివాళి

తొండంగి: పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వచ్ఛంద సంస్థ తెలుగు విభాగం, సాహితీ సుమాలు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ అధ్యక్షత వ్యవహారిక భాషా ఉద్యమకారులు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ మాట్లాడుతూ తెలుగు భాషలోని మాధుర్యం తియ్యదనాన్ని పద బంధాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహా లక్ష్మీనాయుడు, తెలుగు శాఖ అధ్యక్షుడు జె.శ్రీనుబాబు, జువాలజీ అధ్యాపకుడు బి.శ్రీధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఎం బీమా యోజనతో పేదలకు మేలు

రౌతులపూడి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనా పథకాల ద్వారా పేదలకు మేలు కలుగుతుందని శంఖవరం స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచి డిప్యూటీ మేనేజర్ జీఎల్‌వై కుమార్ అన్నారు. శుక్రవారం బ్రాంచి పరిధిలోని శృంగవరంలో డ్వాక్రా మహిళలతో ఆయన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి పథకం ఆవశ్యకతను, ప్రాముఖ్యతను వివరించారు. సామాన్యుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం సురక్ష బీమా యోజన పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. సురక్ష బీమా యోజన పథకం ద్వారా రూ. 20 చెల్లిస్తే రూ.2లక్షల బీమా, రూ.436 ప్రధాన మంత్రి జీవన్ యోజన పథకం ద్వారా రూ.2లక్షలు బీమా పొందవచ్చునన్నారు. ప్రతి ఒక్కరు బీమా సదుపాయాన్ని పొందాలని ఆయన సూచించారు. వివరాలు కోసం శంఖవరం ఎస్‌బీఐ బ్రాంచిలో సంప్రదించవచ్చునని ఆయన అన్నారు. కాకినాడ లీడ్ జిల్లా మేనేజర్ ప్రసాద్, తిరంశెట్టి గంగాధర్, డ్వాక్రా యానిమేటర్ ఆశిన విజయ, సత్యవతి, పలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభం

ప్రత్తిపాడు: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రత్తిపాడులో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శుక్రవారం ప్రారంభించారు. ప్రయాణికులతో పాటు బస్సులో ఎమ్మెల్యే అన్నవరం వరకు ప్రయాణించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు, వెలుగు ఏపీఎంలు జి శ్రీనివాసరావు, వై వెంకట్, ఏపీఓ కుమారస్వామి, కార్యదర్శి జ్యోతుల పద్మరాజులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.